# ఆదిలాబాద్-మంచిర్యాల



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్



ఆదివారం 12 మే, 2024,
పేజీలు 03


## లోక్ సభ ఎన్నికలకు సర్వం సిద్ధం

**- స్వేచ్ఛయుత ,శాంతియుత వాతావరణంలో ఎన్నికల జరిగేలా ప్రతిష్ట భద్రత ఏర్పాట్లు - ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ సురేష్ కుమార్**

**ఆసిఫాబాద్ ప్రతినిధి 11 మే సూర్య మేజర్ న్యూస్**

పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తెలియజేశారు. మే 13 సోమవారం నాడు జరిగే ఎన్నికలలో భాగంగా ప్రతిష్ట బందోబస్తు ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలియజేశారు. భద్రత ఏర్పాట్లు భాగంగా అసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించారు. అదేవిధంగా బందోబస్తు నిమిత్తం జిల్లాకి



వచ్చినటువంటి పోలీస్ సిబ్బంది యొక్క వసతి సదుపాయాలను పరిశీలించారు. తదనంతరం కాగజ్ నగర్ పట్టణ కేంద్రంలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కూడా పరిశీలించడం జరిగింది. తదనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని కనుక ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని భద్రత ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. కావున ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ తెలియజేశారు.



## ధాన్యం కొనుగోలు లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



2 లో

## వి.ఎం.ల పంపిణీ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**





**మంచిర్యాల ప్రతినిధి,మే 11, సూర్య మేజర్ న్యూస్ :**

లోకసభ ఎన్నికలు-2024 నేపథ్యంలో 002-పెద్దపల్లి (ఎస్.సి.) పార్లమెంట్ నియోజకర్గ పరిధిలోని జిల్లాలో గల మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13న జరుగునున్న పోలింగ్ కార్యక్రమం కొరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పంపిణీ పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి, 004-మంచిర్యాల సహాయ రిటర్నింగ్ అధికారి వి.రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సరిపడా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కేటాయించడంతో పాటు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అదనంగా ఈ.వి.ఎం.లను కేటాయించడం జరిగిందని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈ.వి.ఎం.ల పంపిణీ కొరకు కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ.వి.ఎం.లతో పాటు పోలింగ్ సిబ్బందిని జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వారిగా తరలించడంతో పాటు పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి తీసుకువచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం



**అదిలాబాద్, మే 11 సూర్య మేజర్ న్యూస్**

ఈ నెల13 న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం,తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 599 పోలింగ్ ప్రాంతాలు, అందులో 783 పోలింగ్ బూతు లు ఉన్నట్లు పోలింగ్ లొకేషన్లు మరియు 87 రూట్ల వద్ద, జిల్లాలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ల వద్ద, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.సిబ్బందికి అవగాహన కల్పించడానికి శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి చేయవలసిన విధులపై ముందుగానే తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరి వద్ద సంబంధిత రూట్ మొబైల్ వాహనం అధికారి ఉన్నతాధికారుల నంబర్లను తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలియజేశారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లో, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ స్టేషన్ల లో, ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర బలగాలతో పహారాను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయబడిన స్ట్రాంగ్ రూం వద్ద మూడంచల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కు 48 గంటల ముందు చేయవలసిన కార్యచరణ పై అధికారులకు సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఎటువంటి డబ్బు, మద్యం, ఇతర బహుమతి వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. పోలింగ్ సెంటర్ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రజలను క్యూ లైన్లలో ఉండే విధంగా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంక్, పెన్, మంటను కలిగించే వస్తువులకు అనుమతి లేదని తెలియజేశారు. సిబ్బంది ప్రతి ఒక్కరు లాటి లను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల బందోబస్తులు దాదాపు 1100 జిల్లా పోలీసులు, 400 ఇతర శాఖలకు సంబంధించిన పోలీసులు, 27 సెక్షన్ల కేంద్రబలగాలు, 15 సెక్షన్ల స్పెషల్ పోలీసులు పాల్గొన్నట్లు తెలియజేశారు. ఈ సమావేశం నందు అదనపు ఎస్పీలు సి సమైజాన్ రావు, బి సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్,బి ప్రకాష్, బి సురేందర్ రెడ్డి, సిహెచ్ నాగేందర్,హసీబుల్లా, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని

### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**నిర్మల్,మే 11, సూర్య మేజర్ న్యూస్**

ధాన్యం కొనుగోలు లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం దిలవార్ పూర్ మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలు ప్రక్రియ నిరంతరం జరగాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు త్రాగునీరు, టెంట్లు ఉండేలా చూడాలని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులకు సరిపడినన్ని టార్పాలిన్లను, గన్నీ బ్యాగ్స్ అందుబాటులో ఉంచాలని, మరిన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు పంపాలని ఆదేశించారు. అవసరమైతే ధాన్యం తరలింపునకు అదనపు లారీలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యపు వివరాలను ట్యాబ్ ఆన్ లైన్‌లో నమోదు చేయాలని ధాన్యపు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులంతా కచ్చితంగా ప్యాడి క్లీనింగ్ మిషన్ల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరచిన తర్వాత మాత్రమే అమ్మేలా చూడాలన్నారు. వరి కొనుగోలు కేంద్రం వద్ద గల తూకపు యంత్రాలు, ప్యాడి క్లీనింగ్ యంత్రాలు, తేమ యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు.అనంతరం దిలవార్ పూర్ ఉన్నత పాఠశాలలోని 282, 288 నంబరు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రం లో గల విద్యుత్, ర్యాంప్, ఫర్నిచర్, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లతో వివరాల సమాచారపు పోస్టర్లను అతికించాలని ఆదేశించారు.ఈ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న మరమ్మత్తుల పనులను పరిశీలించారు. నిర్దేశిత గడువులోపు పనులన్నీ పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. మరుగుదొడ్లకు జరుగుతున్న మరమ్మత్తు పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు.ఆ తర్వాత దిలవార్ పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామంలో గల వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలులో జాప్యం లేకుండా చూడాలన్నారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యాన్ని కొన్న వెంటనే మిల్లులకు తరలించాలని తెలిపారు. ప్రతి రైతు ప్యాడి క్లీనింగ్ మిషన్ల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరిచే విధంగా చూడాలన్నారు. వరి కొనుగోలుకు సంబంధించిన వివరాలను కచ్చితంగా ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, తహసిల్దార్ స్వాతి, రెవిన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 13న ఓటు హక్కు ఖచ్చితంగా వినియోగించుకోవాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్



**మంచిర్యాల,మే 11, సూర్య మేజర్ న్యూస్ :**

లోకసభ ఎన్నికలు-2024లో భాగంగా 002-పెద్దపల్లి (ఎస్.సి.) పార్లమెంట్ నియోజకవర్గానికి మే 13న జరుగనున్న పోలింగ్ రోజున జిల్లాలోని 002- చెన్నూర్ (ఎస్.సి.), 003-బెల్లంపల్లి (ఎస్.సి.), 004-మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలోని అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు ఖచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, స్వీప్ యాక్టివిటీస్ నోడల్ అధికారి కిషన్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్యంపై చేపట్టిన 5కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగనున్న లోక్సభ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని, రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని, ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన హక్కు కల్పించడం జరిగిందని తెలిపారు. దేశాభివృద్ధికి పాటు పడే సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, వాలంటీర్ల ఏర్పాటుతో పాటు అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, గర్భిణులు, వయోవృద్ధులు, దివ్యాంగుల కొరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, ప్రత్యేక వరుస ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడమే కాకుండా స్నేహితులు, బంధువులు, ఇరుగు పొరుగు వారందరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ప్రతి ఉద్యోగి వారి కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, వాకర్స్ క్లబ్, రెడ్ క్రాస్ ప్రతినిధులు తమ పరిధిలో గల ఓటర్లు సకాలంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కళాజాత బృందం వారు ప్రదర్శించిన ఆట-పాట అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కె.చిన్నయ్య,జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం, ఎస్.సి. కార్పొరేషన్ ఈ.డి. దుర్గాప్రసాద్, ల్యాండ్ సర్వే ఎ.డి. శ్రీనివాస్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి, జిల్లా పశు వైద్య, సంవర్ధశాఖ అధికారి వై.రమేష్, మున్సిపల్ కమీషనర్లు మారుతి ప్రసాద్,సతీష్,అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సింగరేణి లక్ష్యం

**శ్రీరాంపూర్, మే 11, సూర్య మేజర్ న్యూస్:**

సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి శనివారం శ్రీరాంపూర్



ఉపరితల గనిని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. అలాగే ఉపరితల గని క్వారీ వ్యూ పాయింట్, పని ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించి గని అధికారులతో చర్చించారు. అలాగే సి ఆర్ ఆర్, జివిఆర్ ఓబి కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులతో చైర్మన్ బొగ్గు ఉత్పత్తి పై మాట్లాడారు.ఈ సందర్భంగా ఎన్ బలరాం మాట్లాడుతూ రక్షణతో కూడిన ఉత్పత్తి ఉత్పాదకత సింగరేణి లక్ష్యమని, శ్రీరాంపూర్ 24 -25 ఆర్థిక సంవత్సరము నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి రవాణా లక్షణాలను సాధించాలని, దానికి తగిన ప్రణాళికలు అమలు పరచాలని రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. క్వారీలో నీరు నిలవకుండా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఉపరితల గనులలో పనిచేస్తున్న ఉద్యోగులకు తగినన్ని ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం పురుషోత్తం రెడ్డి, శ్రీరాంపూర్ గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, గని ఇంచార్జ్ మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ లో

## ఇంటర్ అడ్మిషన్లకు షెడ్యూల్ విడుదల

### కళాశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి

**మందమర్రి టౌన్, మే 11, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాలకై షెడ్యూల్ విడుదల అయిందని, అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పదోవ తరగతి అర్హత పొందిన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరానికి గాను అంతర్జాలంలోని https://telanganams.cgg.gov.in/ గల వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, మే 25 తారీకు తుది గడువని, దరఖాస్తుకు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. ఎంపిసి, బైపిసి, సీఈసీ, ఎంఈసి కోర్సుల్లో 40 చొప్పున సీట్లు కలవని తెలిపారు. సుదూరప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి సైతం కల్పించడంతో పాటు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల పదవ తరగతి మార్కులు, రిజర్వేషన్ కోట ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందని, ఎంపికైన విద్యార్థుల జాబితాను మే 27న ప్రకటించి, మే 29 నుండి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి తెలిపారు.

## రక్త దానం చేసి నిండు ప్రాణాలు కాపాడిన దీక్షిత్ రక్తదానానికి యువత ముందుకు రావాలి- ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మన్

**భైంసా,మే 11,సూర్య మేజర్ న్యూస్**

భైంసా మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన చైతన్య అనే అమ్మాయికి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో జ్వరం రావడం వలన రక్త పరీక్ష నిర్వహించగా ప్లేట్ లేట్స్ తక్కువ ఉన్నాయి అని రిపోర్ట్ లో తేలింది. అయితే కుటుంబసభ్యులు వాడేకర్ లక్ష్మన్ కు సమాచారం అందచేశారు.వెంటనే ఆయన చాకచక్యంగా స్పందించి అదే గ్రామానికి చెందిన దీక్షిత్ కు సమాచారం ఇవ్వగానే వీరు భైంసాలోని జీవన్దార రక్త నిధి కేంద్రానికి వచ్చి తన అమూల్య మైన బి పాజిటివ్ తెల్ల రక్త కణాలు దానం చేసి మానవత్వం చాటుకున్నారు.ఎవరికి ఏ ఆపద వచ్చిన కష్ట సుఖాల్లో పాల్గొంటూ సమాజంలో మంచి పేరు తీసుకొని వస్తున్నారని వాడేకర్ లక్ష్మన్ ను గ్రామస్తులు,కుటుంబ సభ్యులు పలువురు అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మన్,రక్త నిది కేంద్ర సహాయకులు గోపాల్,కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## 3వ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి
### - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్




**మంచిర్యాల ప్రతినిధి,మే 11, సూర్య మేజర్ న్యూస్ :** లోకసభ ఎన్నికలు-2024 నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లలో జరుగునున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది 3వ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేష్ గుప్తా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా పోలింగ్ సిబ్బంది 3వ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లోక్సభ ఎన్నికలలో భాగంగా మే 13వ తేదీన పోలింగ్, జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరుగుతాయని, ఎన్నికలు సజావుగా సాగేందుకు జిల్లాలో 002-చెన్నూర్ (ఎస్.సి.) నియోజకవర్గంలో 227, 003-బెల్లంపల్లి (ఎస్.సి.) నియోజకవర్గంలో 227, 004-మంచిర్యాల నియోజకవర్గంలో 287 మొత్తంగా 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 3 అసెంబ్లీ సెగ్మెంట్లకు పోలింగ్ సిబ్బందిలో 888 మంది ప్రిసైడింగ్ అధికారులు, 888 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1 వేల 776 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 95 మంది సూక్ష్మ పరిశీలకుల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, ఉద్యోగులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, ఎన్నికల తహశీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఆర్కే 8 డిస్పెన్సరీ లో అంతర్జాతీయ నర్స్ డే సంబరాలు

**శ్రీరాంపూర్, మే 11, సూర్య మేజర్ న్యూస్:** శ్రీరాంపూర్ ఆర్కే 8 డిస్పెన్సరీ లో అంతర్జాతీయ నర్స్ డే ఆదివారం ఉన్నందున శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి సమక్షంలో శనివారం రోజున నర్స్ డే కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా నర్స్ డే నిర్వహిస్తారని అందులో భాగంగా ఆర్కే 8 డిస్పెన్సరీలో ఈ వేడుక చేయడం చాలా సంతోషకరమని అలాగే నర్సుగా పనిచేస్తున్న ప్రతి మహిళ అభినందనీయులని వ్యాధిగ్రస్తులను ఎల్లవేళలా రక్షిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తారని, అలాగే ప్రపంచవ్యాప్తంగా కరోనా సమయంలో అనేక కోట్ల మంది కరోనా బారిన పడినప్పుడు వారికి సేవలందించి ఎంతో మందిని కాపాడిన నర్సులు అభినందనీయులని తెలియజేశారు. ఈ సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ కి నివాళులు అర్పించి కేక్ ని కట్ చేసి నస్పూర్ ఆర్కే 8 డిస్పెన్సరీలో పనిచేస్తున్న నర్సులకు బహుమతులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, ఎస్ ఓ టు జి ఎం వి పురుషోత్తం రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డిజిఎమ్ పర్సనల్ అరవిందరావు, డివై సి ఎం ఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ వేదవ్యాసు, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సులు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రంలో పోలీసుల కవాతు

**నిర్మల్ ,మే 11, సూర్య మేజర్ న్యూస్** నిర్మల్ జిల్లా కేంద్రంలో పోలీసులు శనివారం ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్వేచ్ఛగా జరిపేందుకు వీలుగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కవాతు నిర్వహించడం జరిగిందని పట్టణ సీఐ అనిల్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు అన్నీ పూర్తిచేసామని ఎలాంటి



అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

## పరిహారం అందజేత అటవి శాఖ అధికారులు



**వాంకిడి, మే 11,సూర్య మేజర్ న్యూస్,** మండలంలోని సవాతి జీపి అంతపూర్ గ్రామంలో గురువారం చిరుత పులి దాడిలో లేగదూడ మృతి చెందగా బాధిత రైతు సీడం తానుకు అటవి శాఖ అధికారులు శనివారం పరామర్శించారు. డిఎఫ్ నీరజ్ కుమార్ టిబ్రేవాల్. ఎస్ఆర్వో అప్పలకొండ ఆదేశాల మేరకు తక్షణ నష్టపరిహారం కింద రైతుకు రూ.5 వేలు అందజేసినట్లు డిప్యూటీ రేంజర్ సరోజరాణి తెలిపారు. వన్య మృగాల కదలికలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. క్షణికావేశాలకు గురై జంతువులను వేటాడటం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్బీవో నాగేందర్, సవాతి మాజీ సర్పంచ్ దేవవు, తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన కేంద్ర బలగాలు

**భైంసా,మే 11,సూర్య మేజర్ న్యూస్** భైంసా పట్టణంలో శనివారం కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. భైంసా పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రజల్లో భద్రత కల్పించేందుకుగాను ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు.



## పార్లమెంట్ ఎన్నికల విధులను నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్




**నిర్మల్ ,మే 11, సూర్య మేజర్ న్యూస్** పార్లమెంట్ ఎన్నికల విధులను నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే నిర్మల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అధికారులకు ఎన్నికల్లో పాటించవలసిన నియమ నిబంధనల పై అవగహన కల్పించారు. పోలింగ్ కు ఒకరోజు ముందు ఉదయం సకాలంలో ఈవీఎం పంపిణీ కేంద్రానికి వచ్చి అన్ని రకాల ప్రక్రియలు పూర్తిచేసి మధ్యాహ్న సమయానికల్లా పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలని ఆదేశించారు. పోలింగ్ జరిగే సమయంలో నిర్దేశించిన డేటా ఎంట్రీ యాప్లో సమయానికి పోలింగ్ శాతానికి సంబందించిన వివరాలను పంపవల్సిందిగా ఆదేశించారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఈవీఎం యంత్రాలలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తి పోలింగ్ నిలిచిపోతే పోలింగ్ ను తిరిగి త్వరితగతిన ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే అన్ని రకాల రిజిస్టర్లు, ఫారాలు నింపుటపై అవగహన కల్పించారు. రిజిస్టర్లు, ఫారాలు నింపే క్రమంలో ఎటువంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి గానీ, ఓటర్లకు గానీ అనారోగ్య సమస్యలు ఏర్పడితే అత్యవసర వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆహార పదార్థాలు, త్రాగు నీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేయకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు ఎన్నికలపై సిబ్బందికి ఎన్నికల విధులపై అవగహన కల్పించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### దేవరకోట ఆలయంలో
## వైభవంగా పల్లకి సేవ

**నిర్మల్ ,మే 11, సూర్య మేజర్ న్యూస్** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాతనమైన శ్రీ దేవరకోట లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి మాడవీధుల్లో ఊరేగింపు జరిపారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. పల్లకి సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీధర్, ఇంచార్జీ ఈఓ రవి కిషన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

